# అపోస్తులుడైన యాకోబు జీవిత చరిత్ర

యాకోబు జన్మస్థలం - గలిలయ ప్రాంతలో బెత్సయిదావాడు (మార్కు 1:16-19) (మత్తయి 4:21); యాకోబు వృత్తి - చేపలు పట్టే జాలరి (మార్కు 1:19) (లూకా 5:10); యాకోబు తండ్రి - జెబదెయి (మత్తయి 4:21); యాకోబు తల్లి - సలోమే (మార్కు 15:40); యాకోబు సహోదరుడు - అపోస్తలుడైన యోహాను (మత్తయి 4:21); యాకోబు పేరుకు అర్థం - మోసపుచ్చేవాడు, అణచుట; యాకోబుకు మరో పేరు - బోయనెర్గేసు (మార్కు 3:17) ; బోయనెర్గేసు పేరుకు అర్థం - ఉరిమెడివాడు అని అర్థం; హతసాక్షి - యెరూషలేములో హేరోదు చేత తల నరకబడి చంపబడ్డాడు (అపో.కా 12:2)

## వ్యక్తిగత పరిచయం

బైబిల్ గ్రంధంలో కొంతమంది యాకోబులు మనకు కనిపిస్తారు, ఇస్సాకు కుమారుడైన యాకోబు, యేసు క్రీస్తు ప్రభువు వారి తమ్ముడైన యాకోబు ఇతను యెరూషలేము దేవాలయంలో కాపరిగా పనిచేసిన వాడుగా అలానే యాకోబు పత్రిక రాసిన వాడుగా ఉన్నాడు, ఆల్ఫాయి కుమారుడైన యాకోబు ఇతను 12 మంది శిష్యులలో ఒకడు ఇతనిని చిన్న యాకోబు అని కూడా పిలుస్తారు. ఈరోజు మనము ధ్యానం చేయబోయేది జెబదెయి కుమారుడైన యాకోబు, యోహాను సహోదరుడైన యాకోబు జెబదెయి, సలోమీలా మొదటి కుమారుడు. యోహాను యొక్క సోదరుడు ఇతను చేపలు పట్టే జాలరి. అలానే కొన్ని పడవలు ఉన్నట్లు మనం చూడగలం. సముద్ర తీరాన యేసు వారిని పిలిచిన వెంటనే వారి ధోనెలను , వలలను విడిచి ప్రభువును వెంబడించాడు. తరువాత యేసు ప్రభువు యాకోబుకి "బోయనెర్గేసు" అనే పేరును నామకరణం చేసారు. దానికి ఉరిమెడివారు అని అర్థం. మొదట ముఖ్యమైన ముగ్గురు వ్యక్తులలో స్థానమును సంపాదించుకున్నవాడు యాకోబు. ఇతనిని జెబదెయి కుమారుడైన యాకోబు అని అంటారు. అపోస్తులలో ముందుగా దేవుని కొరకు హతసాక్షిగా హేరోదుచేత తల నరకబడి మరణించిన వాడుగా మనం చూడగలం

## యాకోబు సేవా జీవితం

- **తండ్రిని, తన పనిని విడిచి ప్రభువును వెంబడించిన యాకోబు** (మత్తయి 4:21-22)
  యేసు దనికులలో నుండి పండితులలో నుండి వ్యక్తులను ఎన్నుకోలేదు కాని సామాన్య పనులు చేసుకునే వారిని ఎన్నుకున్నాడు. వారిని అసామాన్యులుగా తయారుచేశాడు. యేసు యాకోబుని పిలవగానే దేవుని మాటకు విధేయుడై తండ్రిని, తన వృత్తిని విడిచి ప్రభువు మాటకు లోబడి ఆయనను వెంబడించాడు. ఒకవేళ దేవుడు నిన్ను సేవకు పిలిస్తే నీకు ఉన్న స్థితిని, నీకు కలిగినది విడిచి ఆయనను వెంబడించు. ఆయనే నిన్ను నడిపిస్తాడు. అసామాన్యుడిగా, మనుషులు పట్టు జాలరిగా తయారుచేస్తాడు. (మత్తయి 16:24 25) (మార్కు 3:7)

- **ప్రభు రాజ్య వ్యాప్తి కొరకు అధికారము పొంది నిస్వార్థమైన పరిచర్య చేసిన యాకోబు (మత్తయి 10:7-14)**

  దేవుని రాజ్యం సమీపంగా ఉందనడానికి అద్భుతాలు రుజువు, యేసు వారికి ఉచితంగా ఇచ్చేఅధికారం మూలంగా వారు ధనం సంపాదించుకోకూడదు ఇతరుల మేలుకోసం వాటిని వినియోగించాలి (అపో.కా 20:30-35) ఆనాటి అపోస్తులకి దేవుడిచ్చిన అధికారం గొప్పది కానీ వారు సామాన్యమైన జీవితాన్ని జీవించారు. త్యాగం, క్రీస్తు శిష్యుల లక్షణం వారు ఉచితంగా తమకున్నది ఇవ్వాలి ఇతరులు ఉచితంగా ఇచ్చిన తీసుకోవాలికోవాలి నేటి దినాలలో ఇలాంటి నిస్వార్థమైన పరిచర్యలు చేసే సేవకులు కానీ పరిచర్యలు కానీ ఉన్నాయి అంటారా.. ఆనాటి అపోస్తలులు దేవుని కొరకు త్యాగం చేసి నిస్వార్థంగా నిరాడంబరంగా జీవించి క్రీస్తు సువార్త పరిచర్య చేశారు అందులో యాకోబు కూడా ముఖ్యుడు .

- **క్రీస్తు మహిమ దృశ్యాన్ని రూపాంతరాన్ని ముందుగానే చూడగలిగిన యాకోబు (మత్తయి 17:12)**

  ఎత్తైన పర్వతం బహుశా హెర్మోను పర్వతం అయి ఉండవచ్చు క్రీస్తు మహిమ దృశ్యాన్ని రూపాంతరం చెందిన దృశ్యాన్ని, వెలుగును స్వల్పకాలం చూడగలిగాడు యాకోబు. (యోహాను 1:4) ఆయనలో జీవముండెను ఆజీవము మనుష్యులకు వెలుగైయుండెను. ఈ వెలుగును మన జీవితంలో చూడగలుగుతున్నామా. క్రీస్తు చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తాడు అనడానికి ఇది సాక్ష్యం (మత్తయి 16:27). (రోమా 12:2) మనం కూడా క్రీస్తుకు మన జీవితాలను శరీరాలను సజీవయాగముగా సమర్పించుకుంటే క్రీస్తు మహిమలో ఆయనతో పాల్గొనే అర్హతను ఆయన మహిమను పొందుకుంటాం.

- **ఆవేశపరుడైన యాకోబు (ఉరిమెడివారు) (మార్కు 3:17)**

  యాకోబు అతని సహోదరుడు కాస్త ఆవేశాన్నీ చూపేవారు అనుకోవచ్చు. ఒక మాటలో చెప్పాలంటే షార్ట్ టెంపర్ కలిగినవారు. అందుకే యాకోబుకి యేసుక్రీస్తు వారు స్వయంగా బోయనెర్గెసు అనే నామం వారికి పెట్టాడు (లూకా 9:54). క్రీస్తుకు అగౌరవం కలిగిందని వారికి కోపం వచ్చింది యాకోబు ఆపరిస్థితిని పూర్తిగా గ్రహించలేదు. తర్వాత యేసు వారిని గద్దించాడు చాలా సందర్భాల్లో చిన్న చిన్న విషయాలకే కోపం, ఆవేశపడుతూ ఉంటాము. బైబిలు చెబుతుంది కోపపడుడి కానీ పాపం చెయ్యకుడి. యాకోబు నువ్వు సెలవిచ్చెన వారిని బస్మం చేసేద్దాం అంటున్నాడు. మనం కోపంలో ఏం మాట్లాడుతున్నామో ఏం చేస్తామో గ్రహించలేము (మత్తయి 5:5) సాత్వికులు ధన్యులు అంటున్నాడు.

## క్రీస్తు శ్రమలలో పాలిభాగస్తుడైన యాకోబు (మత్తయి 20:23), (మార్కు 10:38)

నేను త్రాగిన గిన్నెలోనిది మీరు త్రాగలేరు అన్నప్పుడు నేను త్రాగగలను అని యాకోబు సమాధానమిస్తాడు. గిన్నెలోనిది త్రాగడమంటే ఆయన అనుభవించిన బాధలలో, తిరస్కారాలలో పాలుపొంపులు పొందడం అప్పుడు వారు అది గ్రహించలేకపోయినా తర్వాత కాలంలో యాకోబు క్రీస్తు కొరకు శ్రమను అనుభవించాడు. ఖైదు చేయబడి చంపబడ్డాడు. నిజంగా శిష్యులు (అపో.కా 5:18,40,41) (రోమా 8:17) క్రీస్తు కొరకు శ్రమపడిన అనుభవం మనకి ఉంటే మనము కూడా యాకోబు వలే క్రీస్తు మహిమలో పాలివారము ఆయన తోటి వారసులము.

## ధన్యుడైన యాకోబు (అపో.కా 12:2-3)

యాకోబు హేరోదు చేత ఖైదు చేయబడి ఖడ్గంతో చంపబడ్డాడు. అపోస్తులలో మొదటి హతసాక్షిగా మారిన వ్యక్తి యాకోబు. ఆ పని యూదులందరికీ నచ్చడం వలన మరల పేతురును బంధించి ఖైదు చేశారు అని వాక్యం చెబుతుంది. అంటే యూదులు అపోస్తలులను, క్రీస్తు రాయబారులను అంగీకరించలేదు. (మత్తయి 5:11) నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. అంటే దన్యకరమైన ముగింపును యాకోబు పొందుకున్న వాడుగా ఉన్నాడు. మరి సేవకునిగా క్రీస్తు రాయబారిగా ధన్యకరమైన ముగింపును మనం కలిగి ఉండగలమా యాకోబు వలే నిస్వార్థమైన పరిచర్య చేసి క్రీస్తు రాజ్య వ్యాప్తి కొరకు పాటుపడి ఆయన మహిమలో పాలుపొంపులుపొంది ఆయన కొరకు శ్రమలో పాలి భాగస్తులుమై ధన్యకరమైన ముగింపును పొందుదుము గాక ఆమెన్...